సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం । 17 । జులై । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 25.472 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి 953 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,180
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,494
3 శాతం జీఎస్టీతో..	రూ.5,659
నవర (8 గ్రా)	రూ.45,272

గరిష్టం/కనిష్టం
35.5 /28.9

వాతావరణం

ఆదివారం గాలిలో తేమ 51 శాతం ఉంది. సోమవారం జిల్లావ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

కసుమూరు దర్గాలో తమిళనాడు మంత్రి



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మంత్రి మస్తాన్

వెంకటాచలం: వెంకటాచలం మండలం కసుమూరు దర్గాను తమిళనాడు రాష్ట్రానికి చెందిన మైనార్టీ శాఖ మంత్రి కేఎస్ మస్తాన్ కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. దర్గాకు చేరుకున్న మంత్రికి ముజావర్లు ఘన స్వాగతం పలికారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు.

19 నుంచి కోటి కుంకుమార్చన

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన శ్రీమల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో ఈ నెల 19 నుంచి 29వ తేదీ వరకు కోటి కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు తెలిపారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ 2018లో ఆలయంలో కోటి కుంకుమార్చన కార్యక్రమాన్ని చేపట్టామని తిరిగి ఐదేళ్ల తర్వాత ఈ కార్యక్రమాన్ని శాస్త్రోకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటీవలే ఆలయంలో మహాకుంబాభిషేకం చేశామని, అనంతరం కోటి కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 11వ రోజు పూర్ణాహుతితో ఈ కార్యక్రమం ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందిస్తున్న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, దాతలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి, కొలన్ రాజారెడ్డి, పూజిత దంపతులు, ఇతర దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

రాజ్యాధికారమే లక్ష్యం



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి

ఆత్మకూరు: అన్ని పార్టీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర బహుజనులను ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని 85 శాతం ఉండే బహుజనులు సమైక్యమై రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేయాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డి.పరంజ్యోతి పిలుపునిచ్చారు. బీఎస్పీ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జి నందా ఓబులేసు ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని నేతాజీ క్లబ్‌లో నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి, ప్రధాన కార్యదర్శి జానకిప్రసాద్ ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలను లక్షాధికారులుగా చేస్తానని ఊదరగొట్టిన చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏమి చేశారని ప్రశ్నించారు. ఇప్పుడు మళ్లీ మహిళలను కుబేరులుగా చేస్తానని ప్రచారం చేయడం హాస్యాస్పదమన్నారు. తొలుత అంబేడ్కర్, కాన్షీరామ్, జ్యోతిరావుపూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు కాకుటూరు పుష్పాంజలి, కార్యదర్శి శ్రీరామ్, చెన్నుపల్లి రామకృష్ణ, టి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంచనాలు తలకిందులు

- ఎన్ని వ్యూహాలు పన్నినా లోకేశ్ బహిరంగ సభకు ఆశించిన స్థాయిలో రాని జనాలు
- లోకేశ్ ప్రసంగిస్తుండగానే వెనుదిరిగిన వైనం
- ఫ్లెక్సీలు కట్టి కుదించినా నిండని సభా ప్రాంగణం
- కందుకూరు అభివృద్ధి, ఎమ్మెల్యేపై పసలేని ఆరోపణలు

కందుకూరు: యువగళం పాదయాత్రను ఉమ్మడి ప్రకాశం జిల్లాలో భారీ ఎత్తున విజయవంతం చేయాలనుకున్న తెలుగుదేశం పార్టీ నేతలకు ఆదిలోనే ప్రజలు ఊహించని షాక్ ఇచ్చారు. కందుకూరు నియోజకవర్గంతో మొదలయ్యే పాదయాత్రను భారీ స్థాయిలో విజయవంతం అవుతుందనే టీడీపీ నాయకుల అంచనాలు తలకిందులయ్యాయి. రెండు రోజుల పాటు లింగసముద్రం, వలేటివారిపాళెం మండలాల్లో జరిగిన పాదయాత్ర ఇందుకు నిదర్శనం. మొదటి రోజు అర్ధరాత్రి పాదయాత్ర చేసి తీవ్ర విమర్శలు పాలవ్వగా, ఆదివారం జరిగిన బహిరంగ సభకు అనుకున్న స్థాయిలో జనాలు రాకపోవడం గమనార్హం.

పారని టీడీపీ వ్యూహం

ఇరుకైన రోడ్లను ఎంచుకుని దానికి ఇరువైపులా భారీగా ఫ్లెక్సీలు కట్టి మధ్యలో జనాలు కుక్కి భారీ స్థాయిలో జనాలు వచ్చినట్లు చూపించడం నారా లోకేశ్ యువగళం బహిరంగ సభలకు టీడీపీ అనుసరిస్తున్న వ్యూహం. ఆదివారం వలేటివారిపాళెం బహిరంగ సభకు కూడా ఇదే విధానాన్ని టీడీపీ నేతలు ఎంచుకున్నారు. వలేటివారిపాళెం బస్టాండ్ సెంటర్‌లో కందుకూరు రోడ్డుకు ఇరువైపులా భారీ ఫ్లెక్సీలు కట్టి మధ్యలో సభను ఏర్పాటు చేశారు. దీంతో కొద్ది మంది జనాలు వచ్చినా సభా ప్రాంగణం మొత్తం నిండుతుందని భావించారు. అయితే టీడీపీ నేతలు ఊహించిన విధంగా జనాలు రాకపోవడంతో సభా ప్రాంగణం వెనుకవైపు పూర్తిగా వెలవెలబోయింది. లోకేశ్ ప్రసంగ వాహనానికి కొద్ది దూరం వరకు మాత్రమే జనాలు ఉన్నారు. దీంతో లోకేశ్ బహిరంగ సభకు ఊహించని స్థాయిలో జనాలు రాలేదని స్వయంగా టీడీపీ కార్యకర్తలు, నాయకులు చర్చించుకోవడం గమనార్హం. అదే సమయంలో వచ్చిన కొద్దిపాటి జనాలు కూడా లోకేశ్ ప్రసంగిస్తుండగానే వెనుదిగారు. దీంతో సభా ప్రాంగణం చాలా వరకు ఖాళీగా దర్శనమిచ్చింది.



వలేటివారిపాళెంలో ఇరుకురోడ్డులో సభ ఏర్పాట్లు చేసిన దృశ్యం

పసలేని ఆరోపణలు

బహిరంగ సభలో కందుకూరు అభివృద్ధి, ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డిపై పసలేని ఆరోపణలు చేశారు. ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్న రామాయపట్నం పోర్టు, రాళ్లపాడు ప్రాజెక్టు అభివృద్ధిపై విమర్శలు చేశారు. వాస్తవానికి ఐదేళ్లు అధికారంలో ఉన్నా పోర్టు పనులు గాని, రాళ్లపాడు ప్రాజెక్టు అభివృద్ధి పనులు ప్రారంభించిన పాపాన పోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పోర్టు పనులు ప్రారంభించారు. అలాగే పొగాకు రైతులు నష్టాల్లో ఉన్నట్లు చెప్పుకొచ్చారు. కానీ గత రెండు సంవత్సరాల నుంచి పొగాకు రైతులకు చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా అధిక ధరలు వస్తున్నాయి. ఇలా ప్రకాశం జిల్లా అభివృద్ధిపైన పసలేని ఆరోపణలు చేయడంపై విమర్శలు వ్యక్తమైయ్యాయి.



లోకేశ్ మాట్లాడుతున్న సమయంలో సభా ప్రాంగణంలో పలుచగా ఉన్న జనాలు

నాయకుల పేర్లు కూడా ప్రస్తావించని వైనం

అదే సమయంలో స్థానిక టీడీపీ నాయకుల పేర్లను బహిరంగ సభలో కనీసం ప్రస్తావించకపోవడం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్న ఇంటూరి నాగేశ్వరరావు, ఆయన సోదరుడు ఇంటూరి రాజేష్‌లు పాదయాత్రను విజయవంతం చేసేందుకు అష్టకష్టాలు పడ్డారు. ఇద్దరూ తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించుకునేందుకు పోటీ పడ్డారు. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో టికెట్ విషయంలో ఇప్పటికే చర్చ నడుస్తుంది. ఎవరి వారు తమకే టికెట్ వస్తుందని చెప్పుకుంటూ వస్తున్నారు. ఆదివారం జరిగిన బహిరంగ సభలో లోకేశ్ కనీసం వీరి పేర్లు కూడా ప్రస్తావించకపోవడం గమనార్హం. అయితే అంతకు ముందు మాట్లాడిన ఇంటూరి నాగేశ్వరరావు మాత్రం తనకు అవకాశం వచ్చింది, 2024 ఎన్నికల్లో తనను ఆశీర్వదించండి అని ప్రజలను వేడుకోవడం కొసమెరుపు.

అలిగిన దివి శివరాం

నారా లోకేశ్ క్యాంపు సైట్ వద్ద సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే దివి శివరాంకు చుక్కెదురైంది. ఆదివారం శివరాం సతీమణి సౌభాగ్య పుట్టిన రోజు. ఈ సందర్భంగా క్యాంపు సైట్‌లో ఉన్న లోకేశ్ వద్దకు వెళ్లి లోకేశ్ సమక్షంలో భర్త్‌డే కేక్ కట్ చేయాలని దంపతులిద్దరూ భావించారు. ఈ క్రమంలో లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా అక్కడ ఉండే సెక్యూరిటీ సిబ్బంది ఇద్దరి లోపలికి అనుమతించకపోవగా అక్కడి నుంచి నెట్టి వేశారు. దీనిపై కలత చెందిన శివరాం దంపతులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. క్యాంపు సైట్ నుంచి వలేటివారిపాళెం బహిరంగ సభ వరకు ఎక్కడా పాదయాత్రలో కూడా పాల్గొనలేదు. అయితే ఆ తరువాత విషయం తెలుసుకున్న లోకేశ్ బహిరంగ సభ వేదిక వద్ద శివరాం దంపతులిద్దరినీ తన ప్రసంగ వాహనంపై ఎక్కించి వారిని శాంతపరిచారు.



క్యాంపు సైట్‌లోకి అనుమతించకపోవడంతో వెళ్లిపోతున్న శివరాం దంపతులు

సబ్సిడీపై బియ్యం, కందిపప్పు విక్రయాలు

- జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్



సబ్సిడీపై బియ్యం, కందిపప్పు కౌంటర్‌ను ప్రారంభిస్తున్న జేసీ కూర్మనాథ్

నెల్లూరు(సెంట్రల్): ప్రజలపై భారం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై కందిపప్పు, బియ్యం రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి పంపిణీ చేస్తోందని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ తెలిపారు. నెల్లూరులోని నవాబుపేట, ఫత్తేఖాన్‌పేట, కందుకూరు రైతుబజార్లలో సబ్సిడీపై బియ్యం, కందిపప్పు విక్రయాలను జాయింట్ కలెక్టర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజలకు సబ్సిడీపై నిత్యావసర సరుకులు పంపిణీ చేసేలా ఇప్పటికే వివిధ ప్రాంతాల్లోని రైతుబజార్లలో టమాటాల విక్రయాలు ప్రారంభించామని తెలిపారు. మరో 6 చోట్ల ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. నాణ్యమైన బియ్యం కిలో రూ.48కి, కందిపప్పు రూ.137లకు అందిస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా జిల్లావ్యాప్తంగా పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కాపులు సీఎం జగన్‌కు అండగా నిలవాలి



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు, పక్కన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ హరినారాయణన్

- రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు
- అట్టహాసంగా కాపు భవన్ ప్రారంభం

నెల్లూరు(వేదాయపాళెం): రాష్ట్రంలో కాపుల సంక్షేమానికి పెద్దపీట వేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కాపులు అండగా నిలవాలని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. రాష్ట్ర కాపు సంక్షేమం, అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలో నూతనంగా నిర్మించిన కాపు భవన్‌ను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో కలిసి ఆయన ఆదివారం ప్రారంభించారు. తొలుత కాపు భవన్ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రులు అనంతరం జ్యోతి ప్రజ్వలన గావించారు. స్థానిక కాపు, బలిజ నేతలు అతిథులకు సాదర స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ నెల్లూరులో కాపు భవన్ నిర్మాణానికి ప్రభుత్వం 3.45 ఎకరాల స్థలం కేటాయించడంతోపాటు రూ.6.15 కోట్ల వ్యయంతో భవన నిర్మాణం పూర్తి చేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కాపు కార్పొరేషన్ ఏర్పాటు, కాపు నేస్తం, కాపు భవనాల నిర్మాణం, ఉపకార వేతనాలు, రాజకీయ పదవులు, నామినేటెడ్ పదవుల్లో తమకు సముచితస్థానం కల్పించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి కాపులు అండగా నిలవాలన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కాపులు సమాజంలో అందరినీ కలుపుకుని ముందుకెళ్తారని తెలిపారు. వారి అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంలో బీసీ భవన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ కాపు భవన్ డైనింగ్ హాల్ కోసం ఎంపీ లాండ్ నుంచి రూ.50 లక్షల నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. నెల్లూరు జిల్లా కాపుల చిరకాల కోరిక అయిన కాపు భవన్‌ను ప్రారంభించుకోవడం చాలా సంతోషకరమన్నారు. భవన నిర్మాణంలో ఎంతో మంది దాతలు సాయం చేశారని చెప్పారు. అలాగే బీసీ భవన్ నిర్మాణానికి మంత్రులు చర్యలు తీసుకోవాలని కోరారు. నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌లో కాపు భవన్ అందరికీ ఉపయోగపడేలా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. కాపు సంక్షేమం, అభివృద్ధి సంస్థ చైర్మన్ అడపా శేషగిరిబాబు మాట్లాడుతూ కాపు భవన్ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. భోజనశాలకు బీద మస్తాన్‌రావు రూ.50 లక్షలు, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ రూ.10 లక్షలు కేటాయించడం అభినందనీయమన్నారు. అలాగే మౌలిక వసతుల కల్పనకు కార్పొరేషన్‌తోపాటు కాపు కార్పొరేషన్ నుంచి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, కలెక్టర్ హరినారాయణన్, కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్, బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటయ్య, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, కార్పొరేటర్ విజయలక్ష్మి, కాపు, బలిజ సంఘాల నేతలు పిండి సురేష్, శ్రీనివాస్, భూపతి విజయ, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ పాయిజన్‌తో 62 మందికి అస్వస్థత

- ఇద్దరి మృతి
- గ్రామంలో వైద్యశిబిరాలు ఏర్పాటు

బుచ్చిరెడ్డిపాళెం: ఫుడ్ పాయిజన్ కావడంతో 62 మందికి అస్వస్థత కాగా అందులో ఇద్దరు మృతిచెందిన ఘటన బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని ఇస్కపాళెం పంచాయతీ పల్లాప్రోలు ఎస్సీకాలనీలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఆదివారం పల్లాప్రోలు ఎస్సీకాలనీలోని చర్చిలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో ఈ ఘటనకు సంబంధించిన వివరాలను జిల్లా వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ ప్రమోద్ వెల్లడించారు. ఈ నెల 13వ తేదీన గ్రామంలో ఒక వేడుక జరగగా దానికి హాజరైన స్థానికులు అక్కడ మిగిలిన భోజనాన్ని తీసుకుని ఆ రాత్రికి నిల్వ ఉంచుకున్నారు. అలా నిల్వ ఉంచిన భోజనాన్ని 14వ తేదీ తినడంతో ఆ రోజు సుమారు 10 మందికి విరోచనాలు, వాంతులు ప్రారంభమయ్యాయి. గ్రామానికి చెందిన పోతురాజు లీలమ్మ(65) అనే వృద్ధురాలికి వాంతులు, విరోచనాలు తీవ్రం కావడంతోపాటు ఇతర వ్యాధులు కూడా ప్రభావం చూపడంతో 14వ తేదీన మృతి చెందింది. అలాగే 15వ తేదీ మరో 52 మందికి వాంతులు, విరోచనాలు కావడంతో వారంతా వివిధ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నారు. అయితే 15వ తేదీ కూడా అదే గ్రామానికి చెందిన దాసరి వెంకయ్య(71) విరోచనాలతోపాటు ఇతర వ్యాధుల ప్రభావంతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ముగ్గురు వైద్యులు, 60 మంది సిబ్బందితో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి పరీక్షలు నిర్వహించారు. అస్వస్థతకు గురైన వారిని స్థానిక చర్చిలో ఉంచి వైద్య సేవలు అందిస్తున్నారు. తొలుత తాగునీటి కలుషితం వల్ల వచ్చిందని భావించినప్పటికీ సంబంధితశాఖ అధికారులు నీటిని పరీక్షించగా ఎలాంటి క్రిములు లేవని తేలింది. గ్రామస్తులను విచారించగా ఫుడ్‌పాయిజన్ అయిందని తెలిపినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైద్యులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.



అస్వస్థతకు గురైన మహిళ నుంచి వివరాలు తెలుసుకుంటున్న వైద్యులు

ఎర్రచందనం డంప్ స్వాధీనం

ఆత్మకూరురూరల్(మర్రిపాడు) : వెలుగొండ రిజర్వు ఫారెస్ట్‌లోని సింగనపల్లి బీట్ కదిరినాయుడుపల్లి సెక్షన్‌లో తరలించడానికి సిద్ధంగా ఉన్న ఎర్రచందనం డంప్‌ను అటవీశాఖ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్ అందించిన సమాచారం మేరకు వైఎస్సార్ జిల్లా బద్వేల్, ఆత్మకూరు రేంజ్ పరిధిలోని అటవీశాఖ అధికారులు తమిళనాడుకు చెందిన ఎర్రచందనం కూలీల కోసం జాయింట్ కూంబింగ్ నిర్వహిస్తుండగా, 40 దుంగల డంప్‌ను గుర్తించారు. దీనిని ఆత్మకూరు అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్లు సమాచారం. ఈ దాడుల్లో ఎఫ్‌ఆర్వో నరసింహారావు, డీఆర్వో శ్రీరామరాజు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు శివకుమారి, సంపత్‌కుమార్ పాల్గొన్నారు. దీనిపై ఆత్మకూరులోని అటవీశాఖ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.



ఎర్రచందనం దుంగలను గుర్తించిన అధికారులు

జలకళ.. పథకం భళా

రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభ్యున్నతే ధ్యేయంగా వైఎస్సార్ జలకళ పథకాన్ని అమలు చేస్తోంది. చిన్న, సన్నకారు రైతులతోపాటు 2.5 ఎకరాల నుంచి 10 ఎకరాల వరకు భూమి ఉన్న రైతులందరినీ ఈ పథకం కింద చేర్చారు. తమ భూముల్లో బోర్లు వేసుకునే ఆర్థిక స్తోమత లేక ఇబ్బంది పడుతున్న రైతులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వైఎస్సార్ జలకళ అండగా నిలుస్తోంది.

- రైతుల పొలాల్లో ఉచితంగా బోరు, మోటారు వేస్తున్న ప్రభుత్వం
- 500 అడుగుల వరకు పరిమితి
- జిల్లాలో ఇప్పటి వరకు వేసిన బోర్లు 1,995
- సీఎం జగన్ తోడ్పాటును కొనియాడుతున్న అన్నదాతలు

ఉదయగిరి: రాష్ట్ర ప్రభుత్వం 2021వ సంవత్సరంలో ప్రవేశపెట్టిన వైఎస్సార్ జలకళ పథకం ద్వారా రైతులు తమ బీడు భూముల్లో ఉచితంగా బోర్లు వేసుకునే అవకాశం లభించింది. తద్వారా రైతుల పొలాలను సాగులోకి తెచ్చుకునే అవకాశం కలిగింది. ఆ పొలాల్లో రైతులు వివిధ రకాల పండ్ల తోటలు, కూరగాయ తోటలు, మెట్టపైర్లు సాగు చేసుకుంటూ ఆర్థికాభివృద్ధిని సాధిస్తూ ముందుకుసాగుతున్నారు.

రైతుల మోముల్లో ఆనందం

జిల్లాలోని ఉదయగిరి, కావలి, ఆత్మకూరు, పొదలకూరు తదితర ప్రాంతాల్లోని రైతుల పొలాల్లో ఇప్పటి వరకు 1,995 బోర్లు వేశారు. వీటిలో కేవలం 50 బోర్లు మాత్రమే విఫలమయ్యాయి. మిగతావి విజయవంతం కావడంతో రైతుల మోముల్లో ఆనందం విల్లివిరుస్తోంది.

500 అడుగుల వరకు పరిమితి

వైఎస్సార్ జలకళలో భాగంగా అర్హులైన రైతుల భూముల్లో ప్రభుత్వం బోర్లు వేస్తోంది. ఈ పథకం ద్వారా 500 అడుగుల వరకు బోర్లు వేసేందుకు జియాలజిస్టులు అనుమతి ఇస్తున్నారు. ఇది కూడా అర్హత పొందిన రైతులను గుర్తించిన తర్వాత జియాలజిస్టు పరిశీలన అనంతరం భూగర్భజలాలు పుష్కలంగా ఉన్నాయని జియాలజిస్టు నివేదిక ఇచ్చిన తర్వాత ఉచితంగా బోర్లు వేసేందుకు చర్యలు తీసుకుంటారు.

బోరుతోపాటు మోటారు ఉచితం

అర్హత పొందిన రైతుల పొలాల్లో బోర్లు వేసిన తర్వాత నీరు పడితే మోటారు కూడా ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. విద్యుత్ సర్వీసుకు సంబంధించి ఫీజును రైతులే భరించాల్సి ఉంది.

అర్హత ఇలా..

- 2.5 నుంచి 10 ఎకరాల వరకు భూమి ఉన్న ప్రతి రైతు ఈ పథకానికి అర్హులు.
- రైతుకు సుమారు 2.5 ఎకరాల భూమి ఒకే ప్రాంతంలో ఉండాలి.
- ఒకే రైతుకు ఒకే ప్రాంతంలో 2.5 ఎకరాల భూమి లేకపోతే రైతుల బృందాలకు 2.5 ఎకరాల నుంచి 10 ఎకరాల వరకు భూమి ఉండవచ్చు.
- 5 నుంచి 10 ఎకరాల భూమి ఉన్న రైతులకు కేవలం బోరు మాత్రమే వేస్తారు. మోటారు ఉచితంగా తీసుకునే అవకాశం లేదు.

దరఖాస్తు చేసుకునే విధానం

అర్హత కలిగిన రైతులు తమ పట్టదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను సంబంధిత సచివాలయంలో అందజేయాలి. పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో భూమిని భౌతిక పరిశీలన చేసి అర్హత కలిగిన రైతులకు బోర్లు వేసేందుకు అనుమతి ఇస్తారు. అయితే జియాలజిస్టు నీరు పడుతుందని సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత బోరు వేస్తారు. నీరు పడిన అనంతరమే మోటారు ఉచితంగా ఇస్తారు.



వింజమూరు మండలం రావిపాడులో వేసిన వైఎస్సార్ జలకళ బోరు (ఫైల్)



లబ్ధిపొందిన రైతుల వివరాలు

రైతుల వివరాలు	వేసిన బోర్లు	ఖర్చు చేసింది (రూ.లక్షల్లో)
ఎస్టీ రైతులు	38	25.67
ఎస్సీ రైతులు	477	319.04
మైనార్టీ	23	15.99
బీసీ రైతులు	630	450.83
ఇతరులు	827	663.23
మొత్తం	1,995	1,474.82

పథకాన్ని సద్వినియోగం చేసుకోండి


వైఎస్సార్ జలకళ పథకం ద్వారా ప్రభుత్వం రైతుల పొలాల్లో ఉచితంగా బోర్లు వేసి మోటార్లు అందిస్తోంది. అర్హులైన రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సన్న, చిన్నకారు రైతులతోపాటు 10 ఎకరాల భూమి ఉన్న రైతులు కూడా పథకానికి అర్హులు.

– వెంకట్రావు, డ్వామా పీడీ

ప్రాణాలకు తెగించి.. చాలా ధైర్యంగా..

కాసేపు విద్యుత్ సరఫరా నిలిచిపోతే చాలు.. వెంటనే లైన్‌మన్‌కి ఫోన్ చేసి అన్నా కరెంట్ ఎప్పుడొస్తుంది..? ఇలా చాలామంది అడుగుతుంటారు. మనిషి జీవితంలో కరెంట్ ఒక భాగమైపోయింది. విద్యుత్ ఉంటేనే చాలా పనులవుతాయి. ఒక్కోసారి వివిధ కారణాలతో సరఫరాలో అంతరాయం ఏర్పడుతూ ఉంటుంది. క్షేత్రస్థాయి సిబ్బంది 24 గంటలూ విధుల్లో ఉంటూ వెంటనే పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటారు. వీరి ఉద్యోగం చాలా కష్టతరమైంది.

- ఎంత కష్టమైనా విధి నిర్వహణలో విద్యుత్ సిబ్బంది
- సరఫరాలో సమస్యల పరిష్కారానికి కృషి
- జిల్లాలో 24 గంటలూ విధుల్లో వందల మంది
- విపత్కర పరిస్థితుల్లోనూ కష్టపడి పనిచేస్తూ..
- ప్రమాదం పొంచి ఉందని తెలిసినా భయపడరు







విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఉమ్మడి జిల్లాలో..
సబ్ స్టేషన్లు : 283
లైన్‌మన్లు : 1,423 మంది
షిఫ్ట్ ఆపరేటర్లు : 1,132 మంది
అధికారులు : 724 మంది
కార్యాలయాల సిబ్బంది : 99 మంది
విజిలెన్స్ విభాగంలో సిబ్బంది : 12 మంది

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్కిల్ పరిధిలో 283 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వీటిల్లో స్వీపర్ స్థాయి నుంచి సూపరింటెండెంట్ (ఎస్ఈ) స్థాయి వరకు మొత్తం 3,390 మంది విధులు నిర్వహిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో కీలకంగా వ్యవహరించే క్షేత్రస్థాయి సిబ్బందిలో జేఎల్ఎంలు (గ్రేడ్–2) 544 మంది, లైన్‌మెన్లు 469 మంది, అసిస్టెంట్ లైన్‌మన్లు (ఏఎల్ఎం) 185 మంది, లైన్ ఇన్‌స్పెక్టర్లు (ఎల్ఐ) 142 మంది, జూనియర్ లైన్‌మన్లు (జేఎల్ఎం) 50 మంది, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్లు 20 మంది, ఫోర్‌మెన్లు 13 మంది ఉన్నారు.

ఏం చేస్తారంటే..

అత్యవసర శాఖల్లో విద్యుత్ శాఖ కూడా ఒకటి. క్షేత్రస్థాయిలో లైన్‌మన్లు, ఇతర సిబ్బందికి చాలా పని ఉంటుంది. కరెంట్ పోయిందని ఏ సమయంలో వినియోగదారుల నుంచి సమాచారం వచ్చినా తక్షణమే స్పందిస్తారు. విద్యుత్ లైన్లు తెగిపోయినా, స్తంభాలు పడిపోయినా, లైన్లకు చెట్ల కొమ్మలు అడ్డుపడినా, ట్రాన్స్‌ఫార్మర్లలో ఫ్యూజ్‌ల సమస్యలు తలెత్తినా, హై ఓల్టేజ్, లో ఓల్టేజ్ సమస్యలు ఏర్పడినా వెంటనే స్పందిస్తారు. మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరిస్తుంటారు. లైన్లు తెగిన సమయంలో ప్రాణాలకు తెగించి సిబ్బంది స్తంభాలు ఎక్కి మరమ్మతులు చేస్తుంటారు. ఈ సమయంలో ఒక్కోసారి ప్రమాదవశాత్తు కింద పడిపోవడం, ఇతర విద్యుత్ ఫీడర్ నుంచి సరఫరా అవడంతో ప్రమాదాల బారిన పడుతుంటారు. ఇలా జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలున్నాయి. మరికొందరు తీవ్రంగా గాయపడిన మంచానికే పరిమితమయ్యారు. ప్రమాదం పొంచి ఉందని తెలిసినా సిబ్బంది చాలా ధైర్యంగా పగలు, రాత్రి, ఎండ, వానను పట్టించుకోకుండా ఎంత కష్టమైనా పని చేస్తారు.

ఈ సమయంలో..

ప్రధానంగా వర్షాకాలంలో విద్యుత్ సిబ్బంది పని చాలా కష్టతరంగా ఉంటుంది. తుపాన్లు, వరదలు విపత్కర పరిస్థితులు తలెత్తితే రోజుల తరబడి ఇంటిముఖం చూసే అవకాశం ఉండదు. దెబ్బతిన్న లైన్లు, కొత్త స్తంభాల ఏర్పాటు పనుల్లో పూర్తిగా నిమగ్నమై సరఫరా పునరుద్ధరణకు శ్రమిస్తుంటారు. అలాగే ఇతర జిల్లాల్లో తుపాన్లు, వరదలు వస్తే ఉన్నతాధికారుల ఆదేశాలతో అక్కడికి వెళ్లి పనులు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఒక్కోసారి క్షేత్రస్థాయి సిబ్బందిపై కొందరు వినియోగదారులు బెదిరింపులకు దిగుతుంటారు. దాడులు కూడా జరుగుతుంటాయి. సరఫరాలో అంతరాయం ఏర్పడి పునరుద్ధరణ చేపట్టే సమయంలో సహనాన్ని కోల్పోయి సిబ్బందిని దూషించడం లాంటి చర్యలకు పాల్పడుతుంటారు.

సిబ్బంది సేవలు అమోఘం



ఇంట్లో కరెంట్ పోతే వెంటనే లైన్‌మన్‌కు ఫోన్ చేస్తుంటాం. కరెంట్ ఎందుకు పోయిందో, ఎంతసేపటికి వస్తుందో తెలియజేస్తుంటారు. ఏ సమయంలోనైనా వారికి ఫోన్ చేస్తే వచ్చి సమస్య ఎక్కడ ఉందో తెలుసుకుని వెంటనే వచ్చి మరమ్మతులు చేసి వెళ్తున్నారు. వర్షాకాలంలో వీరి సేవలు అమోఘం.

– శ్రీనివాసులురెడ్డి, వినియోగదారుడు

ఫోన్ వస్తే వెంటనే స్పందించాలి



ఇంటికి వచ్చి అన్నం తినే సమయంలో కరెంట్ పోయిందని ఫోన్ వస్తే మధ్యలో వెళ్లిపోయి సమస్యను తీర్చిన సందర్భాలున్నాయి. రాత్రి నిద్రపోతున్న సమయంలో ఫోన్ వస్తే వెంటనే వెళ్లి ఏ ప్రాంతంలో ఏ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో విద్యుత్‌కు అంతరాయం కలిగిందో గుర్తించి మరమ్మతులు చేసి వస్తాం. కొన్ని సందర్భాల్లో కంటి నిండా నిద్ర సమయం, కడుపు నిండా తిండి తినే అవకాశం ఉండదు. కుటుంబసభ్యులతో సరదాగా బయటకు వెళ్తే కరెంట్ పోయిందని ఫోన్ వస్తే వెంటనే వచ్చేయాలి. వినియోగదారులకు సేవలు అందించినప్పుడే మాకు సంతృప్తికరంగా ఉంటుంది.

– ఉమర్, జూనియర్ లైన్‌మన్, బీవీనగర్ సెక్షన్

తీసుకుంటున్న జీతానికి న్యాయం చేయాలి



విద్యుత్ సంస్థ నుంచి తీసుకుంటున్న జీతానికి బాధ్యతగా పనిచేయాలి. అప్పుడే వృత్తికి న్యాయం చేసినట్లు. సరఫరాలో అంతరాయాలు కలిగితే వినియోగదారులు పడే ఆందోళనను గుర్తించి సత్వరమే స్పందించి సేవలు అందించడంతో వచ్చే తృప్తి చెప్పలేను. అయితే కొన్ని సందర్భాల్లో మరమ్మతులు చేసే సమయంలో ఆలస్యం జరిగితే చాలామంది మమ్మల్ని తిడుతుంటారు. అయినా వాటిని పట్టించుకోకుండా త్వరగా విద్యుత్ సరఫరా ఇచ్చేందుకు ప్రాధాన్యం ఇస్తాం.

– సుధాకర్, అసిస్టెంట్ లైన్‌మన్ ఈస్ట్–1 సెక్షన్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



జుబేర్ మృతదేహం

కోవూరు: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని రామన్నపాళెం గేట్ సమీపంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కొడవలూరు మండలం గండవరం గ్రామానికి చెందిన ఎస్‌కే జుబేర్ (22) టింకరింగ్ పనులు చేస్తుంటాడు. ఆదివారం అతను, వెంకటేశ్వరపురం జనార్దనరెడ్డి కాలనీకి చెందిన జావీద్ బైక్‌పై నెల్లూరు నుంచి రాజుపాళెం వెళ్తున్నారు. రామన్నపాళెం గేట్ సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చొని ఉన్న జావీద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కోవూరు ఎస్సై దాసరి వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 126
లేయర్ (లైవ్)	: 92
బ్రాయిలర్ చికెన్	: 220
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 244
లేయర్ చికెన్	: 156

నిమ్మధరలు



పెద్దవి	: రూ. 25
సన్నవి	: రూ.12
పండ్లు	: రూ. 5

క్లుప్తంగా


కుటుంబ కలహాలతో కానిస్టేబుల్ ఆత్మహత్య



పోలయ్య మృతదేహం

నెల్లూరు(క్రైమ్): కుటుంబ కలహాలతో ఓ కానిస్టేబుల్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నెల్లూరులోని నవాబుపేట పోలీస్ క్వార్టర్స్‌లో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వాకాడు మండలం తూపిలిపాళేనికి చెందిన పి.పోలయ్య, లక్ష్మమ్మ దంపతులకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. 2013లో చిన్న కుమారుడు పోలయ్య (37) పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరాడు. 2015లో అతడికి విడవలూరు మండలానికి చెందిన త్రివేణితో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులున్నారు. ప్రస్తుతం పోలయ్య నెల్లూరు నగరంలోని బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ నవాబుపేట పోలీస్ క్వార్టర్స్‌లో కాపురం ఉంటున్నాడు. కొంతకాలంగా దంపతుల నడుమ విభేదాలున్నాయి. ఎప్పుడూ గొడవలు పడుతుండేవారు. విషయం తెలుసుకున్న ఇరువైపుల పెద్దలు సర్ది చెప్పారు. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున పోలయ్య తన ఇంట్లోని హాల్లో ఉన్న ఫ్యాన్ హుక్‌కు చున్నీతో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఉదయం 5 గంటల ప్రాంతంలో త్రివేణి తన మామకు ఫోన్ చేసి ఈ విషయాన్ని తెలియజేసింది. దీంతో మృతుడి తల్లిదండ్రులు, బంధువులు, కుటుంబసభ్యులు వెంటనే నెల్లూరుకు చేరుకున్నారు. ఈ మేరకు బాధిత తండ్రి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. నవాబుపేట, బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్లు టీవీ సుబ్బారావు, రాములునాయక్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. జరిగిన విషయాన్ని పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసిన పోలీసులు జీజీహెచ్‌లో మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు. ఏఎస్పీ డి.హిమవతి, నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీస్ అధికారులు పోలయ్య మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

వీవీబీఆర్‌కు మాతృవియోగం



వనజమ్మ (ఫైల్)

నెల్లూరు(బారకాసు): నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి తల్లి వేమిరెడ్డి వనజమ్మ ఆదివారం మృతిచెందారు. గండవరం గ్రామంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. వనజమ్మ మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. నారాయణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ పి.నారాయణ, ఆయన భార్య రమాదేవి, టీడీపీ నేతలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఇంకా వివిధ పార్టీ నేతలు, కళాశాలల కరస్పాండెంట్లు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

కులాల మధ్య చిచ్చు పెట్టింది చంద్రబాబే



మాట్లాడుతున్న కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, పక్కన వైఎస్సార్‌సీపీ నాయకులు

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: 'రాష్ట్రంలో కులాల మధ్య చిచ్చు పెట్టిన ఘనుడు చంద్రబాబు నాయుడు. ఆయన కాలేజీ రోజుల నుంచి ఆ పని చేశారు.' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శించారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని పదో వార్డులో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండు రోజుల క్రితం నారా లోకేశ్ గవర్నర్‌ను కలిసి గంజాయి మాఫియా వెనుక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉన్నాడని ఆరోపించారన్నారు. గంజాయి మాఫియాకు అధినాయకుడు చంద్రబాబే అనే విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. ఆయన రెండెకరాల నుంచి రూ.4 లక్షల కోట్లు ఎలా సంపాదించాడని ప్రశ్నించారు. హెరిటేజ్ పెట్టానని, పాలు అమ్మానని చెప్పుకునే చంద్రబాబు కేవలం వాటి వల్లే ఇంత డబ్బులు సంపాదించాడా?, ఆ కిటుకు ఏంటో అందరికీ చెప్పాలన్నారు. బ్లాక్‌మనీని వైట్‌మనీగా మార్చుకునేందుకు బాబు హెరిటేజ్ పెట్టాడని ఆరోపించారు. వైఎస్సార్ కుటుంబం మొదటి నుంచి వ్యాపారాలు చేసి పైకి ఎదిగారని తెలిపారు. వారి గురించి తెలుగు రాష్ట్రాల్లో ఎవరిని అడిగినా మంచిగా చెబుతారన్నారు.

సీఎం, మంత్రికి కృతజ్ఞతలు

ఇప్పటి వరకు కావలి పరిధిలో ఉన్న ట్రాన్స్‌కో డివిజన్ ఇకపై కోవూరు డివిజన్‌గా మార్చినట్లు ప్రసన్న తెలిపారు. కోవూరుకు ప్రత్యేక ట్రాన్స్‌కో డివిజన్ కావాలని గతంలో గనులు, విద్యుత్, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి విన్నవించామన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన శనివారం రాత్రి శాఖాపరమైన అనుమతులు ఇచ్చారన్నారు. ఇకపై కోవూరు నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, ఇందుకూరుపేట, కొడవలూరు, విడవలూరు మండలాల రైతులకు కూడా విద్యుత్ అధికారులు అందుబాటులో ఉంటారని చెప్పారు. కోవూరులోని ట్రాన్స్‌కో ఈఈ కూడా వస్తారని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం, మంత్రి పెద్దిరెడ్డి, సీఎండీ, ప్రిన్సిపల్ సెక్రటరీ, నెల్లూరు ఎస్ఈకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, ట్రాన్స్‌కో ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ లలితారెడ్డి, కౌన్సిలర్ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడు తనతోనే ఉండాలని..



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

- గోనెసంచిలో మృతదేహం కేసులో వీడిన మిస్టరీ
- కుమార్తె, మరొకరితో కలిసి మహిళ ఘాతుకం
- వివరాలు వెల్లడించిన నెల్లూరు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్): గోనెసంచిలో మృతదేహం కేసులో మిస్టరీ ఎట్టకేలకు వీడింది. స్నేహితుడు తనతోనే ఉండాలని, అతడి భార్య జైలుకు వెళ్లాలనే కుట్రతో ఈ హత్య జరిగినట్లు పోలీసులు గుర్తించారు. నెల్లూరు దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి స్థానిక ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సీతారామయ్యతో కలిసి వివరాలు వెల్లడించారు. పొదలకూరురోడ్డుకు చెందిన జహీర్ బాషా డైకస్‌రోడ్డులో మందుల దుకాణం నిర్వహిస్తున్నాడు. అందులో ఎ.కావ్య అలియాస్ షేక్ సమీరా పనిచేస్తోంది. ఆమెకు అప్పటికే వివాహమై భర్త నుంచి దూరంగా ఉంటోంది. కాగా జహీర్, కావ్య సన్నిహితంగా ఉండేవారు. జహీర్‌కు అప్పటికే అస్మా అనే యువతితో వివాహమైంది. ఎలాగైనా స్నేహితుడు తనతోనే ఉండాలని భావించిన కావ్య ఈ విషయాన్ని తన స్నేహితురాలైన వెంగళరావ్‌నగర్‌కు చెందిన కృష్ణవేణికి తెలియజేసింది. ఆమె ద్వారా యూట్యూబ్‌లో వశీకరణ పూజలు చేస్తామని వీడియోలు చేసిన ఏలూరు జిల్లా కలిదిండి గ్రామానికి చెందిన మణికంఠ (33) గురించి తెలుసుకుంది. గతేడాది ఇద్దరూ కలిసి అతడిని సంప్రదించారు. దీంతో మణికంఠ నెల్లూరుకు రాగా కావ్య, కృష్ణవేణి కలిశారు.

హత్య చేసి..

జహీర్ తనతోనే ఉండిపోయేలా వశీకరణ చేయాలని కావ్య మణికంఠను కోరగా మందు చేసి ఇచ్చాడు. అది పనిచేయలేదని మహిళలు భావించారు. దీంతో మణికంఠను హత్య చేసి ఆ నేరాన్ని జహీర్ భార్యపై నెట్టేస్తే అతను తనతోనే ఉండిపోతాడని కావ్య పథకం రచించింది. ఈ విషయాన్ని కృష్ణవేణి, తన కుమార్తె సాయిప్రియకు తెలియజేసింది. ఈ క్రమంలో గతేడాది నవంబర్‌లో మణికంఠకు పాలలో నిద్ర మాత్రలు కలిపి ఇచ్చారు. అప్పటికి అతను చనిపోకపోవడంతో గొంతునులిమి హత్య చేశారు. కావ్య తన కుమార్తె చేత అస్మాపై అనుమానం వచ్చేలా సూసైడ్ నోట్ రాయించి మృతుడి జేబులో పెట్టారు. అనంతరం మృతదేహాన్ని గోనెసంచిలో పెట్టి స్కూటీపై తీసుకెళ్లి గౌతమ్‌నగర్ రెండో వీధిలో పడేసింది. దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ ఘటనా స్థలానికి చేరుకుని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతుడి జేబులో లభ్యమైన లేఖ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నివేదికలో మణికంఠది హత్యేనని తేలడంతో కేసును మార్చి విభిన్న కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

నగదు డ్రా చేసి..

మణికంఠ హత్య అనంతరం కావ్య మృతుడి ఏటీఎం కార్డు ద్వారా రూ.3.50 లక్షలను విడతల వారీగా నగదు డ్రా చేసింది. అందులో రూ.లక్ష నగదు స్నేహితురాలికి ఇచ్చి మిగిలిన నగదుతో బంగారం కొనుగోలు చేసింది. సాంకేతికత ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు మణికంఠను హత్య చేసింది కావ్య అని గుర్తించారు. ఆమెకు సాయిప్రియ, కృష్ణవేణి సహకరించారని గుర్తించి శనివారం రాత్రి వారందరినీ అరెస్ట్ చేశారు. 25 గ్రాముల బంగారు ఆభరణాలు, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు ఏటీఎం కార్డులను స్వాధీనం చేసుకున్నారు. హత్య కేసును ఛేదించిన పోలీసు అధికారులను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో ఎస్సై రమేష్‌బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన నెల్లూరు క్రికెట్ జట్టు

బుచ్చిరెడ్డిపాళెం: అంతర్ జిల్లాల సూపర్ సెవన్ క్రికెట్ చాంపియన్‌షిప్‌లో నెల్లూరు బాలుర సబ్ జూనియర్ జట్టు సత్తా చాటి తృతీయ స్థానంలో చాటింది. ఆదివారం బుచ్చిరెడ్డిపాళెంలో రాష్ట్ర షూటింగ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆ జట్టుకు అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు భీమతాటి వెంకటరమణయ్య మాట్లాడుతూ ఇటీవల కడప జిల్లా ఒంటిమిట్టలోని మున్సిపల్ స్పోర్ట్స్ గ్రౌండ్‌లో జరిగిన అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో నెల్లూరు జట్టు తృతీయ స్థానంలో నిలవడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సొంత చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న అసోసియేషన్ సభ్యులు